# వెలివేతల గొంతుకలు

## అంటరానోళ్ళ ఆత్మకతలు

**మా శాంతమ్మ నల్ల తీగెలాగుంటది. బలే నవ్వుద్ది. ఆ పిల్ల నవ్వుతా వుంటే బొందు మల్లెలుండ్లా! అయ్యి యిరబూసినట్టుంటయి.**

# బానిస బతుకు బతక బళ్ళే!

కపటం లేని పిల్ల. మాట అనదు. మాట బడదు. ఏ మొగోడైనా తప్పకూత కూసిండా ఆడి మీదకి సెల్లకత్తి దీస్కోని పోతది. శాంతమ్మని మా పెదయ్య కొడుక్కే యిచ్చినం. ఆనందరావు బో బలం గలోడు. అదేదో ఇంగిలీసు బొమ్మలో టారజనుంటడే, అట్టుంటడు.

సద్దికూడుదిని కొండకు బోతే నాలుగైదు మణుగుల కట్టెలేంది కొండ దిగడు. కొడేలెత్తి కొడితే ఎంత క్కట్టెనా రొండై పోవాల్సిందే! కాళ్ల కింద వురుగో వుట్రో దగిల్తే యిస్సిరి నూకేది. పాలకొండ గాని, పిగిశర్ల కొండ గాని ఆనందరావుకి కొట్టిన పిండే! సద్దికూటిలోకి పచ్చిమిరపగాయలు కొరుక్కోని దిన్నా సంకటేళకి మటుకు నీసుండాల్సిందే! కొండకు బొయ్యి వొచ్చేటప్పుడు నంజు కోసరము కవుజులో, సెవుల పిల్లులో, దొరికితే ఉడుములో పట్టుకొచ్చేది. కొండ కట్టెలమ్మి పదో పరకో దొరికితే దాసుకోకుండా అన్నీ దెచ్చి శాంతమ్మ చేతిలో పెట్టేది. శాంతమ్మ ఆనందరావన్న సంకల్దాక కూడా రాదు. కానీ అట్టా వురిమి జూస్తే చాలు. ఆనందరావన్న కొమ్ములు దించుకోని బోతడు. ఆయన్నికి సిన్నప్పడే తల్లిబోయింది. ఒక్కటే బిడ్డ. మా గురపెద్దయ్య ఇంగ మల్లా పెళ్లి జేసుకోలా!

ఏ ఆడకూతురొంక కన్నెత్తి జూడలా! కొడుకును మాత్రం బోయిదిగ సాకి సెయ్యెత్తి మనిసిని జేసి శాంతమ్మ సేతిలో బెట్టిండు. ఆయమ్మి ఆ గడప దొక్కినాల మంచి ముక్కకి కరువులే! ముదుసుకి కరువులే! గింజలు గానీ వొడ్లుగానీ దేనికి కరువులే!

నిజానికి శాంతమ్మ మదరాసులో వుట్టి బెరిగింది. మా నాగత్తని పెండ్లి జేసుకొని అబ్రాము మామ కడుపు చేతబట్టుకొని మదరాసు బొయ్యిండు. ఆడ ఆవడి అనే వూళ్లో మిలటరోళ్ల టాంకుల్జేసే ప్యాక్టరీలో కొలువు సంపాదించుకున్నడు. ఆయన మదరాసులో పన్జేస్తున్నా మనసు మాతరం వూరిమీనే కొటకలాడతా వుండేది. ఆయన ముసలి తల్లిదండ్రుల్ని చూసేదానికే గాదు నూరేళ్ల జేజమ్మని సూసేదానికి యాడాదికొకసారైనా లింగారెడ్డిపల్లె కొచ్చేది. వూరి మీదా, ఇడిసిబెట్టిన పేగు మీదా ఆయనకి శానా ప్రేమ. అందుకే ఒకర్ని రావిగుంటపల్లెకీ, ఇంకొకర్ని అలవలపాడుకీ ఇద్దరు కూతుళ్లని కాపరానికి పంపిండు. మదరాసులో ఉప్పిడి బియ్యం దినే శాంతమ్మ రావిగుంటపల్లెకొచ్చి చానా పాట్లు పడ్డదిలే!

* * *

కాపరానికొచ్చినవుడు శాంతమ్మకి పద్నాలుగేండ్లుంటయి. ఇంక ఆయేడే కడుపులో వువ్వు బూసె. కాయ గాసె. పండంటి సుందర్రావు బుట్టె. ఇంకో యాడాది తిరిగేలకి మాసూళ్ల కాలం నాటికి సుందరమ్మ బుట్టె. ఇట్టా ఆయిదారు మందిని కన్నది. ఇప్పడు సుందరమ్మకు పదమూడేండ్లు నిండినయ్యి. మొన్నటెండల్లో ఆయమ్మిక్కూడా శాంతమ్మ పెళ్లిజేసింది.

ఆ పెళ్లి సూన్ను కదూ! నేను రావిగుంటపల్లికి బోయింది. నేనేడ దిరిగినా! యాడ కూసున్నా శాంతమ్మ కాడికొచ్చి బువ్వ దినాల్సిందే. తినకబోతే తగువేసుకుంటది. ఆ మద్దేనం బాలకోటన్నతో, ప్రబుదాసు గాడితో, ఇస్రాయేలు బావతో ముచ్చట్లేసుకోని కూటి యేళకి శాంతమ్మింటికి చేరినా!

"యాంది బావా? కుంటతా వస్తుండవు?" అని శాంతమ్మ ఎదురొచ్చి అడిగింది.

"ముల్లు గుచ్చుకుందిలే!" అన్నా.


ముల్లుకేనా ఇంత మూల్గతా వుండావు? పట్నపోళ్లు గదూ! ముండ్లు మిమ్మల్ని జూస్తె ఎదురొస్తయ్యి. మమ్మల్ని జూసి బయపడతయ్యి.

"సరే గానీ సంకటి దిందువుగాని రా! పొయ్యిమీన వుడకతా వుండది" అన్చెప్పి తొక్కుడు క్రరమీద కాలుబెట్టి తెడ్డు దీస్కోని ఎనపతా వుండది.

"శాంతమ్మా! ఈ పన్లన్నీ ఎట్ట నేర్చుకున్నవు? ఎవ్వరు నేర్పుకున్నవు?" అని నేనడిగే వరికి శాంతమ్మ సిత్రంగ ఓ నవ్వు నవ్వి ఆ సంగతులన్నీ సెబతా వుంది.

* * *

నా పెళ్లైనప్పుడు నేను మదరాసు నుంచి ఈడికొస్తే "నువ్వు ఈడ వుండలేవు. ఈ పనులు



జెయ్యలేవు" అని అందరూ అనిండ్రు. బావా!

"లేదు. నేనెట్టయినా ఈడనే వుంటానని జెప్పి ఈడ చానా బాదలు పడిన. ఈడ కూరల్లో కారం తినలేక మాంసం ముక్కలు నీళ్లల్లో కడుక్కోని తినేదాన్ని. ఈ సంగటి తినలేకపొయ్యేదాన్ని. అప్పుడు మాయాయన కొండకి బొయ్యి కట్టెలు దెచ్చి అమ్మి మా కన్నం జరిపేవోడు. అప్పుడు మాదిరిగా ఇప్పుడు వూరు లేదు గదా బావా! అప్పుడంటే చానా బాదలు, కస్టాలు... కొండ కట్టెలు మొయ్యాల, పొద్దుగూకులు అమ్ముకువాల అని బాధ. మామ

చెప్పలు గుట్టి వూళ్లో రెడ్లకిచ్చి వోళ్లేదైనా యిస్తే తెచ్చేవోడు."

"ఆ. మామంటే గుర్తుకొచ్చింది. మీ మావ మీనకి గొడ్డేలి దీసుకోని బోయినా వంటనే? నిజమేనా?" అనడిగిన.

"ఆ సంగతి నీకెవురు జెప్పింంద్రు బావా?" అన డిగింది చిగ్గుపడిబోతా.

"నాకు తెల్పింది గానీ! నువ్వంత దైర్యం ఎట్టదెచ్చుకున్నవు? ఆయన నిన్నేమన్నడు? ఆ సంగతేందో జెప్పు" అనడిగిన కుశాలతో.

"ఇప్పడయన్న ఎందుకులే బావా! అప్పడో సిన్న తనం గదా!" అన్నది.

"ఈ సంగతి రేపు నీ మనవళ్లకి, మనవరాళ్లకి చెప్పేదానికి సాచ్చీకం గాబల్లే! సెప్ప సెప్పు" అని తొందర జేసినా.






ఆయమ్మి బలే మొండిది. ఒకరకంగా బతిమిలాడితే చెప్పలా! ఆకరికి జెప్పటానికి మల్లుకున్నది.

అప్పట్లో మావ, అదే మీ పెదయ్య. సెప్పలు గుట్టి వూళ్లోకి బొయ్యి సంగటి బెట్టిచ్చుకోనొచ్చేవోడు. సద్దలు, రాగులు దెచ్చేవోడు. సద్దన్నం, సంకటి చేసుకోని దినేది. ఆ సద్దలు రోట్లో యేసి

—ఎండ్లూరి సుధాకర్

దంచను చాతొచ్చేది కాదు. నువ్వు దంచలేవులే అని వాళ్లు వీళ్లు దంచిచ్చేది. "సంగటి జెయ్యమ్మా" అని మామ చెబితే పంగటెనిపే తప్పుడు కుండలన్నీ బొక్కబడి సంగటంతా పొయ్యిలోకి బొయ్యేది, అట్ట రెండు మూడు సార్లు కుండలు బగలగొట్టిన.

ఇంగ మామ చూసి జూసి ఏమన్నడంటే

"నువ్వు వండలేవు. పెట్టలేవు. నీగుండా గాదని" జెప్పి మామే సంగటి జేసి పెట్టి గిన్నెలో ఏసి పెడితే తినేది. మళ్లీ గిన్నె ఇంట్లో నుంచే బయటికి యిస్రిరి నూకేది, ఎల్లిపోయేదాన్ని నాకు బయమేసి. ఆ వంతున జేస్తా వుండిన.

"నిన్ను గొయ్యా! నీకెంత జెప్పినా గానీ నీకు తెలివి లేదు. పని జెయ్యలేవు. సంగటి జెయ్యలేవు" అని మామ తిట్టేవోడు.

"నేను జెయ్యను" అనే దాన్ని.

ఇంగ మామ కొట్లాటకొస్తదు. నేను గూడ మామకి ఎదురు దిరిగేది, ఏదో ఒకటి కొట్లాడేది.

అట్టనే ఒకసారి బాగా కొట్లాట అయింది. అన్నం, కూరలు జేసే దాన్లోనే తగువు.

"నేను సంగటి చేతికి కరుసుకోకుండా ముద్ద జేస్తా సూడు. కూరలెట్ట జేస్తనో సూడు" అన్నడు మామ.

"నువ్వు అత్త జచ్చిపోయినాల ముంచి చేసినోడువి. అందుకని నీకలవాటు. నాకు సంగటి చెయ్యను తెలియదు. ఇప్పుడు నువ్వు జేసి పెడితే తిసె దాన్నే గానీ లేకుంటే నేను తిన్లేను. జెయ్యలేను" అన్న.

ఇంగ ఆవంతున రోజూ వొండి పెడతా వున్నడు. నేనూ మా ఆయన తింటూ వున్నం.

"రేపు నువ్వు సంగటి జెయ్యాలమ్మే! శాంతమ్మా" అని ఒకనాడు మామ కచ్చితంగ జెప్పిందు.


"అహ నేను జెయ్యను" అన్నా ఎప్పటాలనే. ఇంకజూడు బావా! మామకి బలే కోపమొచ్చింది గావాల. "నువ్వు జెయ్యనంటుండవా అన్జెప్పి గూటం దీసుకోనొచ్చిండు. నన్ను కొట్టేదానికి."

"నువ్వు నామీనకి గూటం దెస్తవా?" అని నేను గొడ్డేలి దీసక బోయిన.

"నాకు దెలియదు మామా! అయ్యన్నీ నాకు అలవాటు లేదు. నువ్వే జేసి పెట్టాల. నువ్వెందుకు నామీద తగాదా యేసుకునేది?" అని గట్టింగ అరిసిన.

తర్వాత మామనే ఎట్టనో బాదలుపడి వండిపెట్టేవోడు. సుందరమ్మ పుట్టినంక గూడ మామ అన్నం వండి, కారప్పొడి గొట్టి బాలింత పత్తెం చేపిచ్చేవోడు. గిన్నె మంచం మీనకి దెచ్చి అందిచ్చేది. పాపం సచ్చి ఏ లోకానుండడో!



"అమ్మో! శాంతమ్మ నువ్వు తక్కువదానివి గాదు గదా! మొత్తానికి మీ మామని మూడు చెరువుల నీళ్లు తాపినావు. మా పెదయ్య జచ్చిన లోటు కనబడతుండదా నీకు?" అనడిగిన.

ఆ ఆయన బొయ్యినంక మాకు చానా బాదైంది. నన్ను కట్టెలకి బోనిచ్చేది లే! నీళ్లకి బోనిచ్చేదిలే! మామే తెచ్చి పోసేది. లేకుంటే మా ఆయనప్పుడు బేల్దారి మేస్త్రీగా పని జేపిస్తుండేది గదా! ఆ పని పిల్లోల్లతో తెప్పిస్తుండేది. అప్పుడు మామ జేసే పనులన్నీ ఇప్పుడు మేం జేసుకుంటుండ్లా!

"కొడుకుతో బాటు కోడల్ని గూడా ఇంత బాగ చూసుకునే మామని ఇప్పుడే జూస్తుండా!" అనన్నా.

ఆయన బొయ్యినా, మనసు మా మిందనే వుంటది బావా! ఒకరోజు సుందరమ్మ కట్టెలకి బోలేదని కొట్టిన. అప్పుడు మీ పెదయ్య ఆయమ్మి కల్లోకొచ్చి "మ్మెయ్! నువ్వు నా సమాది కాడికిరా! నీకు కట్టెలేరి పెడతా. నువ్వు మీ యమ్మ చేత కొట్టిచ్చుకోబాకు" అని జెప్పిండంట.

ఆమైన పొద్దున్నే సుందరమ్మ నాకాడకొచ్చి యమా! యమా! రాత్రి నువ్వు నన్ను గొట్టినవు గదా! జేజి నా కల్లోకొచ్చి కట్టెలేరి పెడతా రామ్మా అన్నడు. జేజా! నీ సమాది కాడికి నేను రాను. నాకు బయము అన్నదంట."

లేదమ్మా! ఏరి పక్కన్నే బెడతా రామ్మా! నీకేం బయం లేదు. మీ యమ్మ చేత గొట్టించుకోకుండా నాకాడకిరా. అన్నడంట.

అట్టా మామ మంచిగ కానొస్తదు బావా! అన్నది శాంతమ్మ అప్పటి సంగతులు తొవ్వుకుంటూ.

"మొత్తానికి మావంటే గురయ్యే! కోడలంటే శాంతమ్మే!" అన్నా నేను నవ్వతా.

అంతేలే బావా! సెప్తకుంటే తరిగేది గాదు. పిలకాయల్ని సదివిపియ్యాలని అనేవోడు. "మ్మెయ్, శాంతమ్మా! మనకెట్టా సదువుల్లేవు. నా మనవల్నన్నా బాగా సదివిపియ్యి, సంసారుల్తో సమానంగా ఉజ్జోగాలు సెయ్యాల. యిస్త్రీ గుడ్డలేసుకోని రోడ్డు మీన తిరగాల. ఎంత గొప్ప కులమోడన్నా గానీ నా మనవలకి సెయ్యెత్తి నమస్కారం జెయ్యాల. నా మాదిరిగా ఈ పిలకాయలు గూడా బానిస బతుకు బతక బళ్లేదు శాంతమ్మా!" అనేవోడు.

"దానికి తగ్గట్టు నా కొడుకులు అంత సదువులు సదవాల గదా బావా!" అన్నది శాంతమ్మ.

మా పెదయ్య గుంట్లోకి బొయ్యి గూడా మా జాతి కోసం కలలు గంటానే వుండాడు గావాల అనుకున్నా నేను!...